రోడ్డు పనులను పరిశీలించిన కలెక్టర్

మునగాల మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మునగాల, ఆగస్టు 27 : మండలంలోని తిమ్మారెడ్డిగూడెం నుంచి ముకుందాపురం వరకు రెండు కోట్లతో నిర్మించనున్న సుమారు మూడున్నర కిలోమీటర్ల ఫార్మేషన్ వెట్ మిక్స్ పనులను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. బీటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని, నిధులను వెంటనే విడుదల చేస్తామని పంచాయతీ అధికారులకు సూచించారు. ఆయన వెంట పీఆర్ గీఈ వి.వెంకటయ్య, డీఈఆర్ వెంకట, శ్రీహర్ష, ఏఈ రంగారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రికల్చర్ విద్యార్థులకు గ్రామీణ కృషి అనుభవం ఎంతో ముఖ్యం

- కేవీకే శాస్త్రవేత్త ఆదర్శ్

గ్రామీణ విశ్లేషణ పటం ద్వారా అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ డిగ్రీ విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత

మోతె, ఆగస్టు 27 : గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం (రావే)లో భాగంగా లయోలా అకాడమీ సికింద్రాబాద్‌కు చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ విధానాలు, స్థితిగతులను తెలుసుకొని గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ (పీఆర్ఏ) కార్యక్రమం ద్వారా అధ్యయనం చేసినట్లు కేవీకే శాస్త్రవేత్త డి.ఆదర్శ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గ్రామీణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ విద్యార్థినులు గ్రామస్తులతో సంభాషించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వాటికి పరిష్కార మార్గాలను గ్రామ పటం, వెన్ డయాగ్రమ్, పై చార్ట్ చిత్రాల రూపంలో ప్రదర్శించి తెలియజేశారు. గ్రామం యొక్క వనరులను గ్రామ పటం ద్వారా చిత్రీకరించి గ్రామంలోని రైతుల వర్గీకరణ, జనాభా భౌగోళిక ప్రాంతం, నీటి వనరులు, వ్యవసాయ దిగుబడులు, చీడపీడల నివారణకు ఆచరిస్తున్న విధానాలపై చార్ట్‌లో చిత్రీకరించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఎక్కువగా ఒకే పంట పండిస్తున్నారని, దాని ద్వారా భూసారం తగ్గి చీడపీడలు పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయని తెలిపారు. పంట మార్పిడి విధానాన్ని పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. రైతుల కోసం కేవీకే చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో రావే ఇన్‌చార్జి నరేశ్, ఏఓ అరుణ, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ వ్యవసాయ విధానాలు, స్థితిగతులపై సదస్సు

అన్నారంలో గ్రామ పటం ద్వారా రైతులకు వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత్త

తిరుమలగిరి (పెన్‌పహాడ్), ఆగస్టు 27 : మన్నూర్ యూనివర్సిటీ విద్యార్థులు, కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తల సహకారంతో మండలంలోని అన్నారం రైతు వేదికలో గ్రామీణ వ్యవసాయ విధానాలు, స్థితిగతులపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను తెలుసుకొని పరిష్కారాల మార్గాలపై విశ్లేషించారు. గ్రామంలోని రైతుల వర్గీకరణ, నీటి వనరులు, వ్యవసాయ దిగుబడులు, చీడపీడల నివారణ, రైతులు ఆచరిస్తున్న అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, ఒకే పంట పదేపదే వేస్తుండడంతో భూసారం తగ్గి, చీడపీడలు పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయని వివరించారు. కేవీకే ప్రోగ్రామ్ అసిస్టెంట్, రావే ఇన్‌చార్జి ఆకుల నరేశ్, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధనే లక్ష్యంగా పోరాడుతాం

- వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

చివ్వెంల, ఆగస్టు 27 : రాజ్యాధికార సాధనే లక్ష్యంగా వికలాంగుల ఉద్యమాన్ని రాజీ పడకుండా కొనసాగిస్తామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దురాజ్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన సంఘం వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలోని ఎర్రకోటపై, తెలంగాణలో గోల్కొండ కోటపై దివ్యాంగుడు జాతీయ జెండా ఎగురవేసే రోజు వచ్చే వరకు దేశంలోని, రాష్ట్రంలోని రాజకీయ పార్టీలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించి నిరుపేదలకు, దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్యబాబు, గోగుల శేఖర్, సుధాకర్, వెంకటేశ్వర్లు, సైదులు, మధు, వీరమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

తుంగతుర్తిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలి : బీఆర్ఎస్

తిరుమలగిరి (తుంగతుర్తి), ఆగస్టు 27 : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను నియోజకవర్గ కేంద్రం తుంగతుర్తిలో ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రవి కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం తాసీల్దార్ కంట్లమయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. తుంగతుర్తి పట్టణం విద్య, వైద్యం, రవాణా అన్ని రంగాల్లో వెనుకబడిందని తెలిపారు. నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను తుంగతుర్తిలో ఏర్పాటు చేసేలా కృషి చేయాలని కోరారు. ఇందుకోసం త్వరలో ఎమ్మెల్యేను, కలెక్టర్‌ను కలువనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొంకూరి మల్లేశ్, బొజ్జ సాయికిరణ్, గడ్డం సోమేశ్, కొండగడుపుల వెంకటేశ్, మల్లికార్జున్, మధు, నాగరాజు, సురేశ్, మధు, గోపి, శ్రీను పాల్గొన్నారు. 27టిటివై20 : తాసీల్దార్‌కు వినతిపత్రం ఇజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

డాక్యుమెంట్స్ పోయినవి

★సిలువేరు సాయితేజ, S/o. జ్ఞానేశ్వరగిరి, R/o. నార్కట్‌పల్లి గ్రామము & మండలం, నల్లగొండ జిల్లా. నాకు సంబంధించిన రిజిస్టర్డ్ సేల్ డీడ్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 4226/1994, 34/2007 మరియు 1552/2007, SRO నల్లగొండ గలవి నేను బైక్ పై నార్కట్‌పల్లి ప్రయాణిస్తుండగా పోయినవి. దొరికినవారు సంప్ర : 9848083954

INDUSIND BANK LTD.
COMMERCIAL VEHICLE FOR SALE
1). BAJAJ MAXIMA C BS6, TS29TB8052, MODEL :2023.
2). PIAGGIO APE AUTO CLS BS6, TS29TB3781, MODEL :2022.
3). PIAGGIO APE AUTO CLS BS6, TS29TB7837, MODEL :2023.
Cell: 7337351819
D.No.797, 1st Floor, Bharath Reddy complex Opp :MRO Office, Main Road, Kodad-508206

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines.
Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
మిర్యాలగూడ : 9182777059

సర్వే వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్

- నేటి నుంచి గ్రామాల్లో రుణమాఫీ సర్వే
- ప్రత్యేక యాప్‌లో మాఫీ కాని రైతుల వివరాలు నమోదు
- జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి

సూర్యాపేట, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ) : 'జిల్లాలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రైతుల కుటుంబాలను బుధవారం నుంచి ఏఓలు, ఏఈఓలు సర్వే చేయనున్నారు. ఏయే గ్రామాలకు అధికారులు వస్తారో ముందస్తుగానే సమాచారం ఇస్తారు.' అని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. జిల్లాలో తొలి విడుతలో రుణమాఫీ కాని రైతుల కుటుంబాలు 21,916 ఉన్నాయని, వారంతా సర్వేకు సహకరించాలని సూచించారు. సర్వే కోసం ఇప్పటికే ఏఓలు, ఏఈఓలకు అవగాహన కల్పించామన్నారు. రేషన్ కార్డులు లేని కుటుంబాలు కాకుండా టెక్నికల్ ఇబ్బందులతో రుణమాఫీ కాని రైతుల కోసం మలి విడుతలో సర్వే జరుగుతుందని తెలిపారు. రుణమాఫీ యాప్‌పై జిల్లా వ్యవసాయ అధికారి నమస్తే తెలంగాణకు వివరించారు. ఆయన మాటల్లోనే..

నమస్తే తెలంగాణ : ఏ రైతులను సర్వే చేస్తారు?

డీఏఓ : రుణమాఫీ కాని రైతులు రెండు, మూడు రకాలుగా ఉన్నారు. బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డులో పేర్లు ఒకే మాదిరి లేకపోవడం, రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్నవారు ఉండడంతో పాటు రేషన్ కార్డులు లేనివారు కూడా ఉన్నారు. తొలి విడుతగా రేషన్ కార్డులు లేని కుటుంబాలను సర్వే చేసి వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తాం.

నమస్తే తెలంగాణ : రుణమాఫీ యాప్ ఏంటి?

డీఏఓ : రేషన్ కార్డులు లేని కుటుంబాలకు రుణమాఫీ కాకపోవడంతో అలాంటి వారి కోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌లో రుణమాఫీ కాని రైతు కుటుంబాల వివరాలను నిర్ధారణ చేసి అప్‌లోడ్ చేస్తాం. అనంతరం సదరు రైతుల బ్యాంకు అకౌంట్లలో రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుంది.

నమస్తే తెలంగాణ : సర్వే సమయంలో రైతుల నుంచి ఏం తీసుకుంటారు?

డీఏఓ : రేషన్ కార్డు లేక రుణమాఫీ కాని రైతుల పేర్లు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకంతోపాటు రైతు కుటుంబం సెల్ఫ్ డిక్లరేషన్ అఫిడవిట్‌ను తీసుకుంటాం. వాటన్నింటినీ రైతులు సిద్ధంగా ఉంచుకోవాలి. సెల్ఫ్ డిక్లరేషన్ అఫిడవిట్ తమ సిబ్బంది తీసుకువెళ్తారు. జిరాక్స్ సెంటర్లలో కూడా లభిస్తాయి.

నమస్తే తెలంగాణ : యాప్‌తో సర్వే ఎప్పుడు, ఎలా చేస్తారు?

డీఏఓ : జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి అన్ని గ్రామాల్లో సర్వే జరుగనుంది. ఏ రోజు ఏ గ్రామానికి సర్వే కోసం వ్యవసాయ అధికారులు వెళ్లనున్నారో ఆ వివరాలను ముందస్తుగా ఆయా గ్రామాల్లో సమాచారం ఇవ్వడం జరుగుతుంది.

ఎమ్మెల్సీ కవిత విడుదలపై హర్షాతిరేకం

- పటాకులు కాల్చి బీఆర్ఎస్, జాగృతి శ్రేణుల సంబురాలు

కోదాడ రూరల్ : తెలంగాణ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

హుజూర్‌నగర్, ఆగస్టు 27 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మంగళవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణంలో మిఠాయిలు పంచుకొని సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా జాగృతి నాయకుడు మస్తాన్ మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు చేసినా చివరకు న్యాయమే గెలిచిందన్నారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు కేవీఎన్ రెడ్డి, సుధాకర్, నర్సింహారావు, నాగుల్ మీరా, మల్లేశ్, వేణు, కేశవ్, అభిరామ్ పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : కోదాడ పట్టణంలోని నాగార్జున సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేశారు. పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే నయీం, నాయకులు గట్ల కోటేశ్వర్‌రావు, కుక్కడపు బాబు, కౌన్సిలర్ మేదరు లలిత, భాగ్యమ్మ, నాగరాజు, శ్రీను, సుందర్‌బాబు, అభిదర్‌నాయుడు, వెంకట్, మజార్, జానీ, అబు, ఆరీఫ్, సలీం పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో బీఆర్ఎస్ నాయకులను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అక్కినపల్లి జానకిరామాచారి, ప్రధాన కార్యదర్శి అంబాల రాంబాబు, నాయకులు జానీమియా, జనార్దన్, సైదులు, అన్నపూర్ణ, పాషా పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఆరు నెలలుగా కవితకు పట్టిన గ్రహణం వీడిందన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు శ్రీనివాస్, రవికుమార్, వెంకన్న, కిరణ్, సోమేశ్, హరినాయక్, ఉప్పలయ్య, వెంకటేశ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో స్వీట్లు పంచుకుంటున్న జాగృతి నాయకులు

తుంగతుర్తిలో పటాకులు పేల్చి ఆనందం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శాస్త్రోక్తంగా శ్రీకృష్ణుడికి పంచామృతాభిషేకాలు

మఠంపల్లి, ఆగస్టు 27 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున పంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం, అర్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా 27న మధ్యాహ్నం 12గంటలకు నివేదనలు, సాయంత్రం 6గంటలకు శ్రీకృష్ణ పరమాత్ముడికి విశేష ఆరాధనలు, శ్రీకృష్ణ జన్మవృత్తాంతం ప్రవచనాలు నిర్వహించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 8గంటలకు శ్రీకృష్ణుడి విశేష ఆరాధనలు, అర్చనలు, పొన్న వాహన సేవ, ఉట్లు కొట్టే కార్యక్రమం, సాయంత్రం 7గంటలకు మహానివేదన, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

- సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

బొడ్రాయిబజార్, ఆగస్టు 27 : సూర్యాపేట పట్టణ గృహ, వ్యాపార, వాణిజ్య యజమానులు మున్సిపాలిటీకి అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్‌లు మున్సిపల్ కార్యాలయంలో లేదా సంబంధిత బిల్ కలెక్టర్లకు బకాయితో సహా చెల్లించి రశీదు పొందాలని సూచించారు. లేకుంటే మున్సిపల్ చట్టం ప్రకారం బకాయి ఉన్న ఇండ్లను జప్తు చేయడంతోపాటు నల్లా కనెక్షన్ శాశ్వతంగా తొలగిస్తామని హెచ్చరించారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి : ఏఓ

నూతనకల్, ఆగస్టు 27 : రూ.2లక్షల లోపు రుణమాఫీ కాని రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీబాబు సూచించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు లేకపోవడం, ఆధార్ అనుసంధానం కాకపోవడం, బ్యాంకులో పేరు తప్పుగా ముద్రించడం వంటి కారణాలతో కొందరికి రుణమాఫీ కాలేదన్నారు. దరఖాస్తు ఫారంలో బ్యాంకు ఖాతా వివరాలు, రైతు ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల వివరాలు రాసి ఆధార్ జిరాక్స్ పత్రాలతో వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించాలని సూచించారు. సమావేశంలో ఏఈఓలు, జానయ్య, శ్రావణి, భవ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

అర్వపల్లి, ఆగస్టు 27 : మండలంలోని అడివెంల గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులను, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ పవన్‌కుమార్ పరిశీలించారు. పిల్లలు పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ఉపేందర్, ఈసీ నగేశ్, కార్యదర్శి మహాలక్ష్మి, హెచ్ఎం యాదమ్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

హుజూర్‌నగర్, ఆగస్టు 27 : ఫ్రైడే – డ్రై డే, ఫీవర్ సర్వేలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ యాకుబ్ పాషా ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఆర్పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ కృషి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్

మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్

నేరేడుచర్ల, ఆగస్టు 27 : ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాల బలోపేతంతోనే విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన పీడీఎస్‌యూ 50 వసంతాల సభలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, విద్యార్థి హక్కులను కాపాడేందుకు అలుపెరుగని పోరాటం చేస్తున్న ఏకైక సంఘం పీడీఎస్‌యూ అన్నారు. దేశంలోని పేద, అట్టడుగు వర్గాల విద్యార్థులకు సమానమైన, శాస్త్రీయమైన విద్యను అందించాలని ఉద్యమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా విద్యార్థి, ప్రజా ఉద్యమాలు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, పీవైఎల్ జిల్లా నాయకుడు కర్ణాకర్, నాయకులు విజయ్, అశోక్, చక్రవర్తి, యశ్వంత్, త్రివేణి, నవ్య, రాకేశ్, నరేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బుడిగ జంగాలు

కరెంటు కోసం ధర్నా

నడిగూడెం, ఆగస్టు 27 : మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన బుడిగ జంగాల కాలనీకి కరెంటు సరఫరా చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని విద్యుత్ కేంద్రం వద్ద ఆ కాలనీవాసులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో కరెంటు లేకపోవడంతో చీకట్లో పాములు, పురుగులతో ఇబ్బంది పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కరెంటును పునరుద్ధరించాలని కోరారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశులు

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 27 : ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశులు అన్నారు. కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మొక్కలు నాటి సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు బాటవేసిన వారవుతారన్నారు. వాతావరణ సమస్యల పరిష్కారానికి ఒకే ఒక మార్గం మొక్కలను నాటడమేనని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి ఊరిలో ప్రజలకు అవగాహన కల్పించి మొక్కలు నాటే విధంగా చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ వడ్డానం శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాభావం పెంపొందించుకోవాలి : మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల

కోదాడ రూరల్, ఆగస్టు 27 : తోటి వారి పట్ల సేవాభావం కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల అన్నారు. పట్టణంలోని అశోక్‌నగర్‌లో శనగాల రాధాకృష్ణ మానసిక వికలాంగుల సేవాశ్రమంలో అమెరికాలోని తన మనుమరాలు లక్షిక పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. పుట్టిన రోజు, శుభకార్యాలను అనాథ విద్యార్థుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. నిర్వాహకులు శనగాల జగన్, రాజేశ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విష జ్వరాల నుంచి ప్రజలను రక్షించాలి : సీపీఐ

బొడ్రాయిబజార్, ఆగస్టు 27 : మలేరియా, డెంగ్యూ, విషజ్వరాల నుంచి ప్రజలను రక్షించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ధర్మభిక్షం భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విష జ్వరాలపై తగిన చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రెండు నెలలుగా ప్రజలు టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులతో బాధపడుతున్నారని, ఇంటికొకరు జ్వరంతో బాధపడుతున్నా వైద్యారోగ్య శాఖ మొద్దు నిద్రలో ఉన్నదని విమర్శించారు.సమావేశంలో సీపీఐ పట్టణ కార్యవర్గ సభ్యులు నిమ్మల ప్రభాకర్, పెండ్ర కృష్ణ, ఎస్‌కే పాషా, నాయకులు గాలి రామకృష్ణ పాల్గొన్నారు.

హెలిప్యాడ్ కోసం స్థల పరిశీలన

హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

చింతలపాలెం, ఆగస్టు 27 : రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 30న మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి హెలిక్యాప్టర్ ల్యాండింగ్ కోసం పలు శాఖల అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈ కాజన్ గౌడ్, డీఈ రమేశ్, ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ సైదిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

మఠంపల్లి, ఆగస్టు 27 : విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ హరిసింగ్ అన్నారు. గ్రామంలో విష జ్వరాలు వ్యాపిస్తున్నాయన్న ఫిర్యాదు మేరకు మంగళవారం మండలంలోని యాతవాకిళ్ల గ్రామాన్ని ప్రత్యేక అధికారి, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి సందర్శించారు. గ్రామంలో మురుగు నీటి నిల్వలను తొలగించాలని, కాల్వల పూడికతీత, ఫాగింగ్ చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రుణమాఫీపై రైతులు ఆందోళన చెందవద్దు : ఏఓ

రైతులతో మాట్లాడుతున్న ఏఓ బాలకృష్ణ

తిరుమలగిరి (తుంగతుర్తి), ఆగస్టు 27 : రుణమాఫీకి సంబంధించి రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి బాలకృష్ణ అన్నారు. మండలంలోని కొత్తగూడెం రైతు వేదికలో మంగళవారం రైతుల నుంచి రుణమాఫీ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ జరుగుతుందన్నారు. మాఫీ కాని రైతులు ఆధార్ కార్డుతో రుణమాఫీ వివరాలు తెలుసుకోవాలని, సమస్య పరిష్కారానికి తగిన పత్రాలు జత చేసి ఏఈఓలకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఓటరు సవరణను వేగవంతం చేయాలి : తాసీల్దార్

తిరుమలగిరి (నాగారం), ఆగస్టు 27 : ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తాసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన బీఎల్‌ఓల శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు పేరు, ఇంటి అడ్రస్, ఇతర సవరణలు ఉంటే సవరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. 58రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి సవరణ చేయాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన వారందరూ ఒకే బూత్‌లో వచ్చేలా ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీటీ షాహీనీబేగం, తుంగతుర్తి నియోజవర్గ మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణరెడ్డి, ఎంపీఎస్ఓ చింతమల్ల రమేశ్, బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం మండలానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ కేటాయించాలి

అర్వపల్లి, ఆగస్టు 27 : ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను జాజిరెడ్డిగూడెం మండలంలో ఏర్పాటు చేయాలని పూలే, అంబేద్కర్ ఆశయ సాధన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మంజూరైన గురుకుల, మోడల్ స్కూల్ వంటివి మండలంలో ఏర్పాటు కాలేదన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఈ స్కూల్‌ను మంజూరు చేయించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్కల సురేందర్, సిర్పంగి నర్సింహ, వెంకన్న, వెంకటమ్మ, కృష్ణయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కోదాడ పట్టణ అధ్యక్షుడిగా నయీమ్

కోదాడ, ఆగస్టు 27 : బీఆర్ఎస్ పార్టీ కోదాడ పట్టణ అధ్యక్షుడిగా షేక్ నయీమ్‌ను మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ నియమించారు. పట్టణంలో మంగళవారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో చర్చించి ఏకాభిప్రాయంతో నయీమ్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నయీమ్ మాట్లాడుతూ పదేండ్లుగా పార్టీలో పనిచేస్తున్న తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు కట్టబెట్టినందుకు మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, సమన్వయకర్త పైడిమర్రి సత్తిబాబు, పట్టణ ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల వారిని కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. త్వరలో అన్ని వార్డు కమిటీలు పూర్తి చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పట్టణంలో పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానన్నారు.

'తిరుమలగిరిలో బస్ డిపో ఏర్పాటు చేయాలి'

తిరుమలగిరి, ఆగస్టు 27 : తిరుమలగిరి మున్సిపాలిటిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని బస్ డిపో సాధన సమితి అధ్యక్షుడు కడెం లింగయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తిరుమలగిరి మున్సిపాలిటీ నాలుగు జిల్లాల కూడలిగా ఉన్నదని, ఇక్కడి నుంచి రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చక్కటి రవాణా మార్గం ఉన్నదని తెలిపారు. ఇక్కడ బస్ డిపో ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే తిరుమలగిరి నుంచి మంచి రవాణా మార్గం ఉన్నదని తెలిపారు. ఈ క్రమంలో ఇక్కడ బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు.

'రాజ్యాధికారం కోసం సంఘటితం కావాలి'

అర్వపల్లి, ఆగస్టు 27 : రాజ్యాధికారం కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా గౌడ కులస్తులు సంఘటితం కావాలని మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు జెర్రిపోతుల లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, బీసీ కులాలను కలుపుకొని అధిక స్థానాలు గెలువాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, రాగుల సిద్ధిరాములు, బాలరాజు, కిరణ్‌కుమార్‌గౌడ్, రవీందర్ గౌడ్, డాంగే గౌడ్, వీరభద్రం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోకు దెబ్బ సంఘం నాయకులు